సాక్షి
సిద్దిపేట

బుధవారం : 2 : జూలై : 2025



వేలుడు జరిగిన సిగాచి పరిశ్రమలో కొనసాగుతున్న సహాయక చర్యలు

శవాల దిబ్బ

మృత్యుపాశమైలారం

48 గంటలు గడిచినా లభించని అయినవారి జాడ

- ఎటుచూసినా కుటుంబసభ్యుల ఆర్తనాదాలు
- సీఎం రేవంత్‌రెడ్డి వద్ద గోడు వెళ్లబోసుకున్న బాధితులు
- తమవారిని అప్పగించాలని అధికారుల వద్ద వేడుకోలు

పాశమైలారం శవాల దిబ్బగా మారింది. మహా విషాదాన్ని నింపిన సిగాచీ పరిశ్రమ ఘటనతో బాధిత కుటుంబాల ఆక్రందనలు మిన్నంటాయి. తమ వారి ఆచూకీ కోసం వారు పడుతున్న వేదన అంతా ఇంతా కాదు. తమ కుటుంబ సభ్యుల కోసం, వారి బంధువులు, స్నేహితులు.. అధికారుల వద్ద గోడు వెళ్లబోసుకున్నారు. పేలుడు ఘటన జరిగిన పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచీ పరిశ్రమ వద్ద.., మృతదేహాలను తరలించిన పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రి పోస్టుమార్టం గది వద్ద హృదయ విదారక వాతావరణం నెలకొంది. ఘటన జరిగి 48 గంటలు జరిగినా.. తమ వారి ఆచూకీ తెలియకపోవడంతో అయినవారు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. తమవారిని అప్పగించాలంటూ అధికారులను వేడుకుంటున్నారు.

–సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి



పేలుడు జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వివేక్

ఘటన జరిగిన సిగాచీ పరిశ్రమను మంగళవారం ఉదయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా పరిశ్రమలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీఎం వచ్చారని తెలుసుకున్న బాధితులు రేవంత్‌రెడ్డి వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే తమ వారిని అప్పగించాలని వేడుకున్నారు. తమకు తీరని అన్యాయం జరిగిందని తీవ్రంగా విలపిస్తూ రేవంత్‌రెడ్డితో పాటు, అక్కడే ఉన్న మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులను వేడుకున్నారు.

13 మందినే గుర్తించినప్పటికీ..

శిథిలాల కింద లభించిన మృతదేహాలను అధికారులు పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ఉన్న పోస్టుమార్టం గదిలో ఈ మృతదేహాలను ఉంచారు. పేలుడు తీవ్రతకు ముక్కలైన శరీరభాగాలను బెడ్‌షీట్ వంటి వాటిలో మూటలు కట్టి పోస్టుమార్టం గదిలో ఉంచారు. ఇందులో తమ వారు ఉన్నారా..? అని తెలుసుకునేందుకు బంధువులు, కుటుంబసభ్యులు పోస్టుమార్టం గదిలో పరిశీలించారు. మృతదేహాలు గుర్తు పట్టలేనంతగా ఉండటంతో కన్నీరు మున్నీరయ్యారు. త్వరగా తమ వారి ఆచూకీ చెప్పాలని, మృతదేహాలను అప్పగించాలని బాధితులు వేడుకున్నారు. మొత్తం 37 మృతదేహాలు పోస్టు మార్టం గదికి తరలించగా, సాయంత్రం వరకు 13 మృతదేహాలను గుర్తించినట్లు అధికారులు ప్రకటించారు. డీఎన్‌ఏ పరీక్షలు ఆలస్యం కావడంతో అప్పగింత ప్రక్రియ ఆలస్యమవుతోంది.



పరిశ్రమ ఎదుట రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు



మృతదేహాన్ని పోస్టుమార్టమ్ కోసం తరలిస్తున్న సిబ్బంది



పోస్టుమార్టమ్ గది వద్ద మృతదేహాలు



మృతదేహాలను తరలిస్తున్న సిబ్బంది



బాధితులతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

సీఎం రేవంత్ రాకతో భరోసా

పటాన్‌చెరు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన ఇటు పారిశ్రామిక వర్గాలకు, అటు కార్మిక లోకానికి భరోసా కల్పించింది. మంగళవారం రేవంత్ రెడ్డి పాశమైలారం పారిశ్రామిక వాడలోని పేలుడు సంభవించిన సిగాచీ పరిశ్రమలో పర్యటించారు. సహచర మంత్రి వర్గంతో ఆయన చేసిన పర్యటన ఇరువర్గాలకు లాభం చేకూరుస్తుందని స్థానిక పారిశ్రామికవేత్తలు, కార్మిక నేతలు భావిస్తున్నారు. పాశమైలారం పారిశ్రామిక వాడలో దాదాపు 297 పరిశ్రమలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో తరచూ పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవిస్తుంటాయి. సమస్యలున్నప్పటికీ వాటిని పరిష్కరించే యంత్రాంగం సరైన విధంగా స్పందించడం లేదనే వాదనలున్నాయి. సిగాచీ పరిశ్రమలో సంభవించిన దుర్ఘటనతో ఈ ప్రాంతంలో పారిశ్రామిక వర్గాల్లో మరింత కలవరం మొదలైంది. కార్మిక లోకం శోక సంద్రంలో మునిగింది. ఈ పరిస్థితుల్లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన అన్ని వర్గాల్లో కొత్త ఆశలు చిగురించాయి. అటు కార్మికులను, ఇటు పారిశ్రామిక వర్గాలను సమన్వయంగా సమస్యలపై పరిష్కరించుకునే దిశగా సీఎం రేవంత్‌రెడ్డి దిశా నిర్దేశం చేశారు. ఇది భవిష్యత్తులో మరిన్ని మంచి ఫలితాలను ఇస్తుందని పారిశ్రామిక వర్గాలు భావిస్తున్నాయి. సిగాచీ పరిశ్రమలో విస్ఫోటనం వంటి ఘటనలు పునరావృతం కాకుండా సరైన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఇదిలా ఉండగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా మంగళవారం పారిశ్రామికవాడకు చేరుకుని ఎలాంటి రాజకీయ విమర్శలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలకు సానుకూలంగానే స్పందించారు. ఈ దుర్ఘటన సమయంలో తమ వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ కార్మికులకు ఉంటాయని భరోసానిచ్చారు. సీఎం పర్యటన సందర్భంగా జగ్గారెడ్డి పాశమైలారంలో దర్శనమిచ్చారు. ఆయన సీఎం రాక కంటే ముందే దుర్ఘటన జరిగిన ఫ్యాక్టరీ పరిసరాల్లో సీఎం కోసం ఎదురుచూస్తూ కనిపించారు. ఆయన అక్కడ ఉన్నారని తెలుసుకున్న జగ్గారెడ్డి అభిమానులు ఆయన కలుసుకునేందుకు వచ్చారు. సీఎం సందర్శించే సిగాచీ పరిశ్రమకు కొన్ని మీటర్ల దూరంలో జగ్గారెడ్డి తన అనుచరులతో మాట్లాడుతూ కనిపించారు. ఎలాంటి హంగామా లేకుండా రావడంతో కెమెరాలన్నీ ఆయన వైపే తిరిగాయి.



తమవారి ఆచూకీ తెలపాలంటూ సీఎం రేవంత్‌రెడ్డిని వేడుకుంటున్న బాధిత కుటుంబసభ్యులు





తమవారి కోసం రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

న్యూస్‌రీల్

షీటీమ్స్‌తో మహిళలకు రక్షణ

సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: షీటీమ్స్‌తో మహిళలకు, బాలికలకు భరోసాతో పాటు రక్షణ కల్పిస్తున్నట్లు సీపీ అనురాధ తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. మహిళల రక్షణ చట్టాల గురించి పాఠశాలలు, కళాశాలల్లో షీటీమ్ బృందాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. జిల్లాలో షీటీమ్స్ బృందాలు గత నెలలో 310 హాట్‌స్పాట్‌లను సందర్శించి 37మంది ఈవ్‌టీజర్లను పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ డివిజన్ల వారీగా షీటీమ్స్ పనిచేస్తున్నట్లు తెలిపారు. ఏవరైనా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే డయల్ 100 లేదా షీటీమ్ వాట్సప్ నంబర్ 8712667434కు కాల్ చేయాలని ఆమె సూచించారు.

వైద్య వృత్తి పవిత్రమైంది

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి



'డాక్టర్స్ డే' వేడుకల్లో ఎమ్మెల్సీ యాదవరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

గజ్వేల్: వైద్య వృత్తి పవిత్రమైనదని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడి అన్నారు. 'డాక్టర్స్ డే' సందర్భంగా మంగళవారం గజ్వేల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ, లయన్స్ క్లబ్ ఆఫ్ మేధా, లయన్స్ క్లబ్ ఆఫ్ విస్‌డమ్, లయన్స్ క్లబ్ ఆఫ్ మహతి అధ్వర్యంలో స్థానిక వైద్యులను సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి మాట్లాడుతూ వైద్య వృత్తి నుంచి వచ్చిన తనకు ఆ వృత్తిలోనూ మంచి సంతృప్తి ఉందన్నారు. లయన్స్ క్లబ్ సంస్థల అధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఐఎంఏ గజ్వేల్ శాఖ అధ్యక్షులు డాక్టర్ లింగం, సీనియర్ డాక్టర్లు పెంటాచారి, నాగమున్నెయ్య, లయన్స్ క్లబ్ సంస్థల బాధ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డితోపాటు ఇతర వైద్యులను సన్మానించారు.

నిరుద్యోగులకు శిక్షణ

జిల్లా అధికారి నాగరాజమ్మ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎంబీసీ నిరుద్యోగులకు వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ ఉచితంగా నైపుణ్య శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నాగరాజమ్మ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాఫ్ట్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్ ఫౌండేషన్, మాక్ ఇంటర్వ్యూ, సెల్ఫ్ కాన్ఫిడెన్స్ బిల్డింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారని, ఆసక్తి కల్గిన వారు 14లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

పాఠ్య, నోట్ పుస్తకాలు అందించాలి

టీఎస్ యూటీఎఫ్ జిల్లా నాయకులు



డీఈఓ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పాఠశాలల్లో అదనంగా చేరిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫారాలు అందించేలా చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం 26 మండలాల్లోని 112 గ్రామాల్లో ప్రచార జాత నిర్వహించామన్నారు. అలాగే ఉపాధ్యాయుల కృషి, సమ్మర్ క్యాంపుల వల్ల సుమారుగా ఆరు వేలకు పైగా విద్యార్థుల పెరిగారని చెప్పారు. కాని గత లెక్కల ప్రకారమే యూనిఫారాలు, పుస్తకాలు అందాయని, నూతనంగా చేరిన విద్యార్థులందరికీ అందేలా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌కుమార్, శివుడు, రాజు నరసింహ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ వేగిరం చేయండి

- కలెక్టర్ హైమావతి
- నీటి పారుదల, రెవెన్యూ అధికారులతో సమావేశం




మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

సిద్దిపేటరూరల్: రిజర్వాయర్ల ద్వారా ఆయకట్టుకు నీటిని అందించేందుకు కాలువల భూ సేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో నీటి పారుదలశాఖ, రెవెన్యూ శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, గౌరవెల్లి, తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కాలువల ద్వారా చెరువులను నీటితో నింపడానికి కావాల్సిన భూసేకరణపై అధికారులతో చర్చించారు. భూసేకరణ ప్రక్రియలో రెవెన్యూ, సర్వేయర్‌ల పాత్ర కీలకమని, గ్రామాల్లో తహసీల్దార్, సర్వేయర్లు, ఆర్డీఓల సహకారంతో కాలువల భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ నాగరాజమ్మ, గజ్వేల్, హుస్నాబాద్ ఆర్డీఓలు చంద్రకళ, రామ్మూర్తి, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

- వారంలో రెండ్రోజులు డ్రై డే
- డీపీఓ దేవకీదేవి
- పంచాయతీ కార్యదర్శులకు దిశానిర్దేశం



గోవర్ధనగిరిలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు తొలగించాలని సూచిస్తున్న డీపీఓ దేవకీదేవి

అక్కన్నపేట(హుస్నాబాద్): పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) దేవకీదేవి అన్నారు. అక్కన్నపేట మండలంలోని గోవర్ధనగిరి, బొడిగెపల్లి, గౌరవెల్లి, అంతక్కపేట, అక్కన్నపేట గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. వారంలో రెండ్రోజులు తప్పకుండా డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించి, నీటి నిల్వలను తొలగిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలన్నారు. మురుగుకాల్వల్లో పూడికతీత, రోడ్లు, నివాస ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమల మందు పిచికారీ చేయాలని తెలిపారు. మంచినీటి బావులు, ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్ వేయాలని సూచించారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానోతు జయరాం, డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ గుగులోతు మోహన్ నాయక్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మన పరిశ్రమలు భద్రమేనా?

- జిల్లా వ్యాప్తంగా 587 కంపెనీలు
- నిబంధనలు కాగితాలకే పరిమితం
- తూతూమంత్రంగా తనిఖీలు
- భయాందోళనలో కార్మికులు

జిల్లాలో ఉన్న పరిశ్రమలు ఎంత వరకు భద్రమన్న చర్చ సర్వత్రా జరుగుతోంది. అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తుండటంతో అందులో పని చేసే కార్మికులు, స్థానిక ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో సిగాచీ పరిశ్రమలో భారీ పేలుడు చోటు చేసుకోవడంతో 40మందికి పైగా దుర్మరణం చెందగా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన దేశ వ్యాప్తంగా కలకలం రేపింది.

– సాక్షి, సిద్దిపేట

జిల్లాలోని 587 పరిశ్రమల్లో 30వేలకు పైగా కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. పరిశ్రమల్లో కార్మికుల భద్రతపై చర్చించుకుంటున్నారు. యాజమాన్యాలు రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు హడావుడి తప్ప.. అధికారులు కనీసస్థాయిలో తనిఖీలు చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు.

నిబంధనలు గాలికి..

ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం పరిశ్రమల నిర్వహణ ఉండాలి. అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి. ప్రతి పరిశ్రమలలో అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్ వాహనాలు ఉండాలి. అంతే కాకుండా అగ్నిమాపక సిబ్బందిని వారే నియమించుకోవాలి. కార్మికులు 3 షిఫ్టులో పని చేయాలి. కానీ ఇవేవి పాటించడంలేదు.



సిద్దిపేట మందపల్లిలోని పరిశ్రమలు

టెక్నికల్ స్కిల్స్‌లేని వారితోనే పనులు

ములుగు మండలంలోని బండ్ల తిమ్మాపూర్, తునికి బొల్లారం, సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి, మిట్టపల్లి, మర్కూక్ మండలం కర్కపట్లలలో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. వీటిలో పని చేసేందుకు యాజమాన్యాలు ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకువచ్చి పని చేయిస్తుంటారు. వారిలో పలువురికి కనీస టెక్నికల్ స్కిల్స్ లేకుండానే పెద్ద పెద్ద మిషనరీల దగ్గర పనులు చేయిస్తున్నారు. ఎక్కువగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులే అధికం. వీరికి తక్కువ వేతనాలు ఇస్తూ పనిలోకి తీసుకుంటున్నారు. వీరికి ఎలాంటి అనుభవం లేకపోవడం.. పర్యవేక్షణ కొరవడటంతో పలు చోట్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చిన్న చిన్న ప్రమాదాల వల్ల కార్మికులు మృతి చెందినా విషయం బయటకు పొక్కకుండా యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి.

కానరాని తనిఖీలు

పరిశ్రమల్లో నిర్వహణ లోపాలే పలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పరిశ్రమల్లో రియాక్టర్లు, బ్లోయర్లు, స్పెయర్ డ్రయర్లు వినియోగిస్తుంటారు. వాటిలో రసాయన చర్యల కారణంగా కొన్ని సార్లు నిర్ణీతస్థాయికి మించి ఉష్ణోగ్రతలు పెరుగుతుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో వాయువులు సేఫ్టీ వాల్స్, వాల్వ్‌ల ద్వారా డంప్ ట్యాంకులోకి వెళ్లేలా చేస్తారు. అవి సరిగా పనిచేస్తున్నాయా? లేదా? విషయాలను పరిశ్రమలో ఇంజనీర్లు తనిఖీ చేయాలి. నిబంధనల ప్రకారం ఆరు నెలలకోసారి గుర్తింపు పొందిన సంస్థలతో తనిఖీలు చేయించుకుని ధ్రువపత్రాలు పొందాలి. కాలుష్య నియంత్రణ మండలి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి, అగ్నిమాపక శాఖ అధికారులు తనిఖీలు చేయాలి. ఈ పరిశ్రమలలో పూర్తి స్థాయిలో తనిఖీలు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం పరిశ్రమలను తనిఖీ చేయాలని కార్మికులు, స్థానికులు కోరుతున్నారు.

> **ఏడాదికోసారి తనిఖీ చేస్తాం**
>
> కేటగిరిల వారీగా సంవత్సరానికి ఒక సారి తనిఖీలు చేస్తాం. ఆన్‌లైన్‌లో అలాట్‌మెంట్ చేయడం జరుగుతుంది. దాని ప్రకారం జాయింట్ తనిఖీలు చేపడుతాం. నిబంధనల ప్రకారం ప్రమాణాలు పాటించని వారి పై చర్యలు తీసుకుంటాం.
>
> – గంగాధర్ రెడ్డి, ఫ్యాక్టరీస్ అధికారి, సిద్దిపేట

క్లుప్తంగా

ఆలయాల్లో దొంగతనం

మద్దూరు(హుస్నాబాద్): రెండు ఆలయాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం... దూల్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లి, బెక్కల్ గ్రామాల్లోని దుర్గమ్మ ఆలయాల్లోకి చొరబడి హుండీ పగులగొట్టి సుమారు రూ.10వేల నగదు ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్లూస్‌టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. ఇటీవల పలు ఆలయాలు, ఇండ్లలో దొంగలు చోరీలకు పాల్పడటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

నర్సాపూర్‌లో బైక్ చోరీ

నర్సాపూర్ రూరల్: పట్టణంలో పార్క్ చేసిన బైక్‌ను దొంగిలించారు. ఎస్సై లింగం వివరాల ప్రకారం... పట్టణంలోని మారుతీనగర్‌లో దుప్తల భరత్ కొత్తగా నిర్మిస్తున్న ఇంటి ముందు బైకును పార్క్ చేశాడు. ఈనెల 15న గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితుడు చుట్టుపక్కల వెతికిన ఫలితం లేకపోవడంతో మంగళవారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కబ్జాపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వం గౌడ సంఘాలకు కేటాయించిన భూమిని ఓ వ్యక్తి కబ్జా చేస్తున్నాడంటూ మంగళవారం గౌడ సంఘం సభ్యులు తహసీల్దార్ శ్యామ్‌కు వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని జప్తినాచారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కొండపాక శివారులోని సర్వే నం.150లో సుమారు నాలుగెకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నాడు. ఈ భూమిని 30 ఏళ్ల కిందట ప్రభుత్వం గౌడ సంఘం అభ్యున్నతి కోసం ఈత, తాటి వనాల పెంపు కోసం కేటాయించింది. ఎక్సైజ్ శాఖ అధికారులు ఉపాధి హామీ పథకంలో భాగంగా ఈత, తాటి మొక్కలను నాటారు. ఇటీవల వాటిని తొలగించి కబ్జా చేసేందుకు ప్రయత్నించాడని, చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా విచారణ చేసి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

కుక్కల దాడిలో 26 మేకలు మృతి



మృత్యువాత పడిన మేకలు

జహీరాబాద్: కోహీర్ మండలంలోని గురుజువాడ గ్రామంలో కుక్కలు దాడి చేయడంతో 26 మేకలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన మునావర్ పటేల్‌కు చెందిన మేకలు తన వ్యవసాయ క్షేత్రంలో ఉంచారు. సోమవారం ఆరు వీధి కుక్కలు రక్షణ వలయంగా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ కింది వైపు నుంచి షెడ్డులోకి చొరబడి మేకలపై దాడిచేసి చంపివేసినట్లు బాధితుడు పేర్కొన్నారు. సుమారు రూ.1.50లక్షల మేర నష్టపోయినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

నిన్న భార్య.. నేడు భర్త

మరణంలోనూ వీడని బంధం



రమేష్

తూప్రాన్, మనోహరాబాద్(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన భర్త రమేష్ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. భార్య సోమవారం మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మనోహరాబాద్ మండలంలోని కూచారం గ్రామానికి చెందిన దాసరి రమేష్, స్వప్నలు భార్యాభర్తలు. సోమవారం చేగుంట మండలం మక్కరాజ్‌పేట్‌లో శుభకార్యానికి వెళ్లి తిరుగు పయనమయ్యారు. కాగా తూప్రాన్ మండలం శివారులో వీరి స్కూటీని కారు ఢీకొట్టగా స్వప్న (29) అక్కడికక్కడే మృతి చెందింది. రమేష్ (31)కు తీవ్ర గాయాలవ్వడంతో గాంధీలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఒకే రోజు గ్రామంలో భార్యాభర్తల అంతిమయాత్ర నిర్వహించారు. దీంతో గ్రామంలో విషాదం చోటు చేసుకుంది.

కార్మికులకు రక్షణేది?

- పరిశ్రమల్లో కానరాని భద్రత
- శ్రమ దోపిడీకి గురవుతున్న వలస కార్మికులు
- ప్రభుత్వ రక్షణ పథకాలు దూరమే



నారాయణఖేడ్: పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచీ పరిశ్రమలో సోమవారం జరిగిన ఘోర పేలుడు విస్ఫోటనం జిల్లా వాసులను తీవ్రంగా కలచివేసింది. ఇతర ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమల్లో కూడా రక్షణ చర్యలు లేవనే చర్చ కొనసాగుతోంది. జిల్లాలో పత్తి మిల్లు, చెరుకు ఫ్యాక్టరీ, రైస్‌మిల్స్, కంకర క్రషర్, ఫ్లోర్‌మిల్, ఇటుక బట్టీలు, బోరుమోటార్ల డ్రిల్లింగ్, గృహనిర్మాణ రంగం తదితర పరిశ్రమలు సాగుతున్నాయి. స్థానికేతరులు తక్కువ వేతనానికి వస్తుండటంతో వారినే తీసుకుంటున్నారు. హక్కుల గూర్చి అడగకపోవడం, ఎక్కువ పనిగంటలు పని చేస్తుండటంతో యజమాన్యాలు వారినే పనిలో కుదుర్చుకుంటున్నారు. ప్రమాదకర ప్రదేశాల్లో పనులు చేయిస్తుండటంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం పటాన్‌చెరు ఘటన నేపథ్యంలో వలస కార్మికుల ప్రాణాలకు రక్షణ ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

వలస కార్మికులే అధికం

జిల్లాలోని పరిశ్రమల్లో జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్, ఒడిశా, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, బెంగాళ్ తదితర రాష్ట్రాల వలస కార్మికులు వచ్చి పనులు చేస్తున్నారు. కొన్ని చోట్ల అక్కడి కాంట్రాక్టర్లు కార్మికులను ముఠాలుగా తీసుకొచ్చి ఇక్కడ పనుల్లో నియమిస్తున్నారు. యాజమాన్యాల నుంచి నిత్యం పని ఒత్తిడి, శ్రమదోపిడీ, సకాలంలో వేతనం, సరుకులు ఇవ్వకుండా వేధించడం లాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. నిరక్షరాస్యులు కావడంతో చట్టాలపై అవగాహన లేకపోవడం, రక్షణ అంశాలు తెలియక దోపిడీని ఎదుర్కోలేక పోతున్నారు. రసాయన ప్రదేశాల వద్ద పని చేస్తున్న కార్మికులకు కనీసం సేఫ్టీ షూస్, హెల్మెట్లు, గాగుల్స్, అప్రాన్ తదితర రక్షణ చర్యలు చేపట్టడం లేదు. కంకర క్రషర్ యంత్రాల వద్ద పనిచేస్తున్న కార్మికులకు రక్షణ చర్యలు తీసుకోని కారణంగా దుమ్ము ఊపిరితిత్తుల్లోకి వెళ్లి అసువులు బాస్తున్నారు. ఓ ఫ్లోర్‌మిల్‌లో ఓ మహిళ పడి తల, మొండెం వేరైన ఘటన ఆరేళ్ల క్రితం ఖేడ్‌లో చోటు చేసుకుంది. ప్రమాదాలు జరిగి మరణం సంభవించిన సందర్భాల్లో బాధితులకు ఎంతో కొంత ముట్టజెప్పి కేసు కాకుండా తప్పుకుంటున్నారు. పరిశ్రమలపై అధికారులు తనిఖీలు లేకపోవడంతో కార్మికులకు రక్షణ లేకుండా పోతుంది.

కనీస నిబంధనలు పాటించాలి

షెడ్యూల్ పరిశ్రమలైన వీటిలో చట్ట ప్రకారం ఐదేళ్లకోసారి వేతనాలు పెంచాలి. సేఫ్టీ రక్షణతోపాటు ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయం కల్పించాలి. బోనస్ ఇవ్వాలి. షూ, అప్రాన్, మాస్క్, హెల్మెట్ సదుపాయాలు కల్పించాలి. 20 రోజులకు ఒకసారి వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలి. న్యాయపరమైన పనిగంటలు, ఆరోగ్యం, వృత్తి భద్రత కల్పించాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనం పెంచాలి. యూనిఫాం, గుర్తింపుకార్డు జారీ చేయాలి. ఆరోగ్య సమస్యలకు చికిత్స అందించాలి. ప్రమాద బీమా కల్పించాలి. రవాణా ఏర్పాటు, క్యాంటీన్ సదుపాయం ఉండాలి.

ప్రయోజనాలూ కల్పించరు

కేంద్రం ప్రవేశ పెట్టిన ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజీబీవై) లో నైపుణ్యంలేని సహా కార్మికులకు జీవిత బీమా రక్షణ కల్పించాలి. పీఎం సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై) కార్మికులకు ప్రమాదవశాత్తు మరణం, వైకల్యం బీమా రక్షణ లభిస్తుంది. అటల్ పెన్షన్ యోజన ద్వారా పదవీ విరమణ తర్వాత కార్మికులు పెన్షన్ పొందే సదుపాయం. పీఎం శ్రమ యోగి మాన్-ధన్ (పీఎం-ఎస్‌వైఎం) అసంఘటిత కార్మికులకు, నైపుణ్యం లేని కార్మికులతో సహా ఒక పెన్షన్ పథకం. కానీ ఏవీ వీరికి అమలు చేయడం లేదు.

మంత్రి సీతక్కకు సన్మానం



మంత్రి సీతక్కను సన్మానిస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్

నారాయణఖేడ్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను మంగళవారం హైదరాబాద్‌లో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. జిల్లా అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ఆయన వెంట ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, సీనియర్ నాయకులు అశోక్ ఉన్నారు.

విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్య వరం

శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేష్ కుమార్



మాట్లాడుతున్న వీసీ ఉమేష్ కుమార్

హుస్నాబాద్: హుస్నాబాద్‌లో శాతవాహన యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు కావడం గ్రామీణ విద్యార్థులకు ఓ వరం లాంటిందని వీసీ, ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ అన్నారు. తాత్కాలికంగా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ఉమ్మాపూర్ మహాసముద్రం గండి వద్ద కళాశాలకు 35 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించిందన్నారు. భవన నిర్మాణానికి రూ.29.02 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. సీఎస్ఈ, ఈసీఈ, ఐటీ, ఏఐ కోర్సులకు గాను ఒక్కో కోర్సుకు 60 సీట్ల చొప్పున 240 సీట్లు, అదనంగా ఈడబ్ల్యూఎస్ కింద 10 శాతం సీట్లు కేటాయించామన్నారు. ప్రతి కోర్సుకు రూ.50 వేలు ఫీజు నిర్ణయించారని పేర్కొన్నారు.

కౌన్సెలింగ్ షెడ్యూల్..

కళాశాలలో చేరేందుకు కౌన్సెలింగ్ షెడ్యూలు ప్రకారం జూన్ 28 నుంచి జూలై 7 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, 6 నుంచి 10వ తేదీ వరకు ఆప్షన్ల ఎంపిక ఉంటుంది. 13న మాక్ కౌన్సెలింగ్, 14, 15వ తేదీల్లో ఆప్షన్ల మార్పు, 18న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. 18 నుంచి 22 వరకు సెల్ఫ్ రిపోర్టు, 22న ఫైనల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారని చెప్పారు. ఈ సమావేశంలో శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ రవికుమార్, వైస్ చాన్సలర్, ఓఎస్డీ డాక్టర్ హరికాంత్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్స్ తిరుపతి రెడ్డి, అశ్విని పాల్గొన్నారు.

భూ తగాదాలో అడ్డొస్తున్నాడని హత్య



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, చిత్రంలో హత్యకు పాల్పడిన నిందితులు

- 8 మంది నిందితుల అరెస్టు, రిమాండ్
- కంగ్టీ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): భూ తగాదాలో అడ్డొస్తున్నాడని హత్య చేసిన కేసులో 8 మందిని పోలీసులు అరెస్టు చేశారు. గత నెల 29న సిర్గాపూర్ మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో హత్య జరిగిన విషయం తెలిసిందే. మంగళవారం కంగ్టీ సీఐ చంద్రశేఖర్ రెడ్డి పోలీస్‌స్టేషన్‌లో కేసు వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన కుర్మ సాయిగౌండ, కుర్మ రమేష్ కుటుంబం మధ్య భూ తగాదాలు ఉన్నాయి. మృతుడు కార్వట్ల జైపాల్, రమేష్ ఇద్దరు స్నేహితులు. రమేష్‌కు సహకరిస్తూ భూ తగాదా విషయంలో తలదూర్చుతున్నాడనే ఉద్దేశంతో సాయిగౌండ జైపాల్‌పై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో జైపాల్, రమేష్ పొలం వద్ద పశువులకు నీరు తాపుదామని వెళ్లారు. వీరితో మార్గమధ్యలో ఘర్షణకు దిగి సాయిగౌండ, అతని కొడుకులు హన్మగౌండ, రాజు, పండరి, భార్య కిష్టవ్వ, కోడళ్లు కవిత, వసుధ, దాకుగౌండ కలిసి గొడ్డళ్లు, కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో జైపాల్ అక్కడికక్కడే మరణించాడు. రమేష్‌కు తీవ్ర గాయలయ్యాయి. రమేష్ తల్లి మణెమ్మ, గ్రామస్తులు చూసి కేకలు పెట్టడంతో అక్కడి నుంచి పారిపోయారు. నిందితులను రిమాండుకు తరలించారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐ వెంకట్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ లభ్యం



మహేష్‌ను అధికారులకు అప్పగిస్తున్న ఎలకుర్తి గ్రామస్తులు

టేక్మాల్(మెదక్): అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ దొరికింది. ఈ ఘటన మండల కేంద్రంలోని టేక్మాల్‌లో మంగళవారం జరిగింది. ఎస్ఐ రాజేష్ వివరాల ప్రకారం... పాపన్నపేట మండలం బాచారం గ్రామానికి చెందిన రావుగారి మహేష్(15) టేక్మాల్ బీసీ హాస్టల్‌లో ఉంటూ ఉన్నత పాఠశాలలో 10వ తగరగతి చదువుతున్నాడు. నిత్యం మాదిరిగానే సోమవారం హాస్టల్ నుంచి పాఠశాలకు వెళ్లాడు. మధ్యాహ్నం నుంచి కనిపించకపోగా హాస్టల్‌కి వెళ్లలేదు. బంధువులు, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మహేష్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని ఎలకుర్తి గ్రామశివారులో వెళ్తున్న మహేష్‌ను గమనించి గ్రామస్తులు మాజీ సర్పంచ్ శ్వేతా చంద్రశేఖర్‌రెడ్డి ఇంటికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న బీసీ హాస్టల్ వార్డెన్ బాబు అక్కడకు చేరుకొని వివరాలు సేకరించి మహేష్‌ను హాస్టల్‌కు తీసుకువెళ్లాడు.

ఫ్లైఓవర్ కింద మృతదేహం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మృతదేహం లభ్యమైన ఘటన రామచంద్రాపురం పట్టణంలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్ కథనం ప్రకారం.. పట్టణంలోని లింగపల్లి చౌరస్తాలోని ఫ్లైఓవర్ కింద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి వయస్సు 50 నుంచి 60ఏళ్ల మధ్య ఉండవచ్చు అని తెలిపారు. పక్కనే ఉన్న టీ దుకాణం వద్ద పదిరోజులుగా టీ తాగుతున్నట్లు దుకాణ యాజమాని తెలిపారు. మృతుని ఒంటిపై ఎర్రని చొక్క, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడి ఆచూకీ తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

పోలీస్ ట్రైనింగ్ అకాడమి ప్రిన్సిపాల్ మధుకర్‌స్వామి



విద్యార్థులతో మధుకర్‌స్వామి, ఎస్ఐ సత్యనారాయణ

దుబ్బాక: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మేడ్చల్ పోలీస్ ట్రెనింగ్ అకాడమి కళాశాల ప్రిన్సిపాల్ మధుకర్‌స్వామి అన్నారు. మంగళవారం దుబ్బాక పట్టణంలో అఖిలరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాశాలల విద్యార్థులకు వాట్ నెక్స్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఎక్కువగా సెల్‌ఫోన్లు చూస్తున్నారని, అవసరముంటే తప్పా వాడకూడదన్నారు. గుట్కాలు, డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థుల నడవడికను వారి తల్లిదండ్రులు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలరాజ్ ఫౌండేషన్ అధినేత, కూకట్‌పల్లి ఎస్ఐ తౌడ సత్యనారాయణ, ప్రముఖ వ్యాపారవేత్తలు చింత రాజు, నల్ల శ్రీనివాస్, సభ్యులు రవి, సాగర్, మహేష్, ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మోటార్ ఆన్ చేస్తుండగా..

విద్యుదాఘాతంతో రైతు మృతి



భానోతు కిష్టు

అక్కన్నపేట(హుస్నాబాద్): విద్యుదాఘాతంతో రైతు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన మండలంలోని పంతుల్‌తండా గ్రామ పరిధిలోని దుబ్బతండాలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం... తండాకు చెందిన భానోతు కిష్టు అలియాస్ కీచు(51)కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తనకున్న ఎకరంలో వ్యవసాయం చేస్తూ కూలీ పనులకు పోతుంటారు. కొన్ని రోజులుగా ఇంటి మరమ్మతు పనులు చేయిస్తున్నారు. ఇంటి ఆవరణలో నిర్మించిన సంపులో చిన్న మోటార్‌ను బిగించారు. దానిని ఆన్ చేస్తుండగా షాక్ కొట్టి అక్కడిక్కడే మృతి చెందాడు. కూలీనాలీ చేసుకుంటూ జీవిస్తున్న కుటుంబ పెద్ద దిక్కుగా ఉన్న కిష్టు మృతి చెందడంతో తండావాసులు రోదిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే ఆర్థికంగా ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మరో ఘటనలో వ్యవసాయ కూలీ..

చిన్నశకరంపేట(మెదక్): విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి చెందాడు. ఈ ఘటన నార్సింగి కాస్లాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది.



మృతి చెందిన నర్సింహులు

ఎస్ఐ అహ్మద్ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన వంజరి నర్సింహులు(32) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం ఓ వ్యక్తి వద్ద పనులు చేసేందుకు జీతం కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం పొలం పనులకు వచ్చిన నర్సింహులు బోరు మోటారు స్టార్టర్ వద్ద కరెంటు వైర్లు సరిచేస్తున్న క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. నర్సింహులును గమనించి అదే పొలంలో ట్రాక్టర్ నడుపుతున్న స్వామి ఘటన స్థలం వద్దకు రాగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. ఈ విషయం మృతుడి బంధువులతో పాటు పోలీసులుకు సమాచారం అందించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య వెంకటమమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పూజ గదిలో మంటలు

- ఇంటితోపాటు బంగారం, నగదు దగ్ధం
- సిర్గాపూర్ మండలం నల్లవాగులో ఘటన



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన ఇల్లు

కల్హేర్(నారాయణఖేడ్): పూజ గదిలో మంటలు వ్యాపించి ఇంటితోపాటు బంగారం, వెండి వస్తువులు, నగదు దగ్ధమయ్యాయి. ఈ ఘటన మంగళవారం సాయంత్రం సిర్గాపూర్ మండలం నల్లవాగులో జరిగింది. గ్రామానికి చెందిన చిల్లెల నాగయ్య కుటుంబం నిత్యం ఇంట్లో పూజ గదిలో పూజలు చేస్తారు. దీపం వెలిగించి కుటుంబీకులు ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లారు. దీపం కారణంగా ఇంట్లో మంటలు అంటుకున్నాయి. స్థానికులు గమనించి నారాయణఖేడ్‌లోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలు ఆర్పింది. ప్రమాదంలో ఇంటి కప్పు, 8 తులాలకు పైగా బంగారం, 26 తులాల వెండి వస్తువులు, బట్టలు, రూ.1.98 లక్షలు నగదు కాలిపోయింది. పిల్లి దీపం పడేయడంతో ప్రమాదం జరిగి ఉండవచ్చని గ్రామస్తులు భావిస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు.

బెజుగామలో బయటపడ్డ సతిశిల



అపూర్వ సతిశిల

గజ్వేల్‌రూరల్: శిలలు చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయని, ఆ చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఔత్సాహిక చరిత్ర పరిశోధకుడు, కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు కొలిపాక శ్రీనివాస్ పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బెజుగామలో ఇటీవల జైన తీర్థంకరుల శిల్పాలు వెలుగుచూడగా, తాజాగా ఇదే గ్రామంలో అపూర్వ సతిశిలతో పాటు శూలరోహణ ఆత్మాహుతి, ఇతర వీరగల్లులను కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు గుర్తించారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ శిల్పంలో వీరుడు తలపై పెద్దసిగతో, చెవులకు జూకాలు, మెడలో కంటె, జంధ్యం, హస్తభూషణాలు, నడుమున దట్టి, వీరకాసె, చేతులలో ఈటెతో, డాకాలు సాచి, యుద్ధానికి సిద్ధమై ఉన్నాడని తెలిపారు. ఈ వీరునికి కుడిపక్క పెద్ద ధమ్మిల్లంతో, చెవులకు జూకాలతో, మెడలో హారం, చేతులలో ఈటెతో శత్రువును చంపుతున్న వీరనారి నిలబడి ఉందన్నారు. వీరునికి ఎడమవైపున పెద్ద ధమ్మిల్లంతో, జూకాలతో, మెడలో హారంతో, ఎడమచేత కమండలం పట్టుకొని కనిపిస్తున్న స్త్రీ ఆ వీరుని సతి అని పేర్కొన్నారు. కుడిపక్కన ఈటెతో శత్రువుని చంపుతున్న ఆ నారీమణి కూడా వీరపత్నే అయి ఉండవచ్చని చెప్పారు. ఈ వీరునికి ఇద్దరు భార్యలున్నట్లు తెలుస్తుందన్నారు. అక్కడ జరిగిన పోరులో భర్తతోపాటు పోరాడిన భార్య కూడా చనిపోగా, మిగిలిన మరో భార్య భర్తతో పాటు సతీసహగమనం చేసినట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సతిశిల కల్యాణి చాళుక్యుల కాలానికి చెందినదని చరిత్రబృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ తెలిపారు. ఈ పరిశీలనలో చరిత్రకారుల బృందం వెంట గ్రామస్తులు నాంపల్లి స్వామి, శ్యామ్‌కుమార్, కళాధర్‌లు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణం కోసం అప్పులు చేసి..

తీర్చే మార్గం లేక ఆత్మహత్య



ఎరగొల్ల ఎల్లం

చేగుంట(తూప్రాన్): అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మక్కరాజీపేట గ్రామంలో చోటు చేసుకుంది. చేగుంట అదనపు ఎస్ఐ బిక్యానాయక్ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఎరగొల్ల ఎల్లం(36) ఇంటి నిర్మాణం కోసం దాదాపు ఎనిమిది లక్షల అప్పు చేశాడు. తీర్చే మార్గం కనిపించక నిత్యం బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో జూన్ 30న తన పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు నార్సింగి ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సుచిత్రలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఎల్లం మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో గొడవలతో మనస్తాపానికి గురై..

చికిత్స పొందుతూ బాలిక మృతి చెందింది. ఈ ఘటన మండల కేంద్రమైన మాసాయిపేటలో చోటు చేసుకుంది. గత నెల 12న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన విషయం విధితమే. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన దొంతి అక్షయ(15) తల్లిదండ్రులు ఇంట్లో తరుచూ గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలో ఇంట్లో గొడవలతో మనస్తాపానికి గురైన ఆమె గత నెల12న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన స్థానికులు చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అక్షయ మంగళవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



దొంతి అక్షయ

కుటుంబ కలహాలతో యువకుడు



కుమార్

హవేళిఘణాపూర్(మెదక్): యువకుడు ఆత్మహత్య చేసున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని శమ్నాపూర్ గ్రామంలో మంగళవారం వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జోగెల్లి కుమార్(34) కొంత కాలంగా మద్యం తాగి కుటుంబ సభ్యులతో గొడవపడుతున్నాడు. ఈ క్రమంలో సాయంత్రం కుమార్ తాగిన మైకంలో ఇంటికి వచ్చి తండ్రి పోచయ్యతో గొడవపడ్డాడు. క్షణికావేశంలో గ్రామ శివారులో ఉన్న గుట్టవద్దకు వెళ్లి చెట్టుకు ఉరి వేసుకున్నాడు. గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా అక్కడికి వెళ్లి చూసేలోపే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

క్రిమి సంహారక మందు తాగి రైతు..



ఏర్పుల స్వామి

రామాయంపేట(మెదక్): అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని సుతారిపల్లి గ్రామానికి చెందిన ఏర్పుల స్వామి (35)కి భార్య లావణ్యతోపాటు ముగ్గురు కుమారులున్నారు. తనకు ఉన్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అప్పులతో కొంత కాలంగా ఇబ్బందులు పడుతున్నాడు. రెండు రోజుల క్రితం క్రిమి సంహారక మందు తాగాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ విషయమై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.